ప్రజాశక్తి

మంగళవారం 28 జనవరి 2025

I

అల్లూరి సీతారామరాజు



బాధిత గిరిజనులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలకు భూములు స్వచ్ఛందంగా దానం చేసిన భూ బాధితులకు తక్షణమే ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని స్థానిక సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, భూములు తీసుకునే ముందు అధికారులు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడంతో సాగు చేసుకుంటున్న గిరిజనులు తమ భూములను దానం చేశారన్నారు. ఇప్పటికీ వారికి ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పించకుండా సంవత్సరాలు గడపడం సరికాదని చెప్పారు. తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వ స్పందించి భూములు దానం చేసిన బాదిత గిరిజనులకు న్యాయం చేయాలని లేని పక్షంలో వారికి మద్దతుగా ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

గిరిజన చట్టాలకు తూట్లు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ ఎండపల్లివలసలో 1/70 చట్టాన్ని, పెసా చట్టం గ్రామ సభ తీర్మానం ఆమోదం లేకుండా విచ్చలవిడిగా గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యు, పంచాయితీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే భారీ అక్రమ శాశ్వత గృహ నిర్మాణాలు నిర్మిస్తున్నా అధికారులు కనీసం పట్టించుకునే నాధుడే కరువయ్యాడని స్థానికులు మండిపడుతున్నారు. ఒక్క పక్క పెసా కమిటి పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే మరో పక్క ఆ చట్టాన్ని తుంగలో తొక్కి గిరిజనేతరులు అక్రమ కట్టడాలు జోరుగా సాగిస్తున్నారు.

ఎండపల్లివలస ప్రధాన రహదారి పక్కన గంగమ్మ తల్లి ఎదురుగా సీసీ రోడ్డు పక్కన ఓ గిరిజనేతరుడు పంచాయితీ, రెవిన్యూ, గ్రామ సభ తీర్మానం లేకుండా భారీ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు అరికట్టాలని ఎన్నిసార్లు సంబంధిత రెవెన్యూ అధికారులకు, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకునే పరిస్థితి లేదని స్థానికులు మండిపడుతున్నారు. గిరిజన హక్కులు చట్టాలు కాపాడవలసిన అధికారులే పట్టించుకోకుంటే గిరిజనుల పరిస్థితి ఏంటని గిరిజన ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నారు. గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు అరికట్టకపోతే జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ పిఓ దృష్టికి తీసుకెళ్తామని ఆదివాసి గిరిజన ప్రజా సంఘాలు తెలిపారు.



యండపల్లివలసలో చేపడుతున్న అక్రమ నిర్మాణం

సమస్యల పరిష్కారానికి స్కీం వర్కర్ల
ఐటిడిఎ ముట్టడి



ఐటిడిఎ ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న స్కీం వర్కర్లు

ప్రజాశక్తి -రంపచోడవరం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్కీం వర్కర్లు ఐటిడిఎను ముట్టడించారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుండి పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి ఐటిడిఎ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ మాట్లాడుతూ అంగనవాడి, ఆశా వర్కర్స్, స్కూలు శానిటేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అనేక దఫాలుగా ఆందోళనలు చేసి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారికి విన్నవించుకున్నా, పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్కీంవర్కర్లంతా అసహనంతో రోడ్డెక్కి ఐటిడిఎను ముట్టడించేంత ఆందోళన చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులందరూ రోడ్డుపై బైఠాయించడంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది.

ఆందోళనకారుల వద్దకు వచ్చిన సబ్ కలెక్టర్ కల్పశ్రీ సానుకూలంగా స్పందించి యూనియన్ నాయకులతో చర్చించారు. డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ హామీనిచ్చి, ఆందోళన విరమింపచేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతి రాజు, అంగనవాడి హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి నిర్మల, జిల్లా కోశాధికారి కె.రామలక్ష్మి. కె రాణి. కె.వెంకటలక్ష్మి. ప్రసన్న. ఆశ యూనియన్ జిల్లా నాయకులు కలింకోట రమణమ్మ, కొమరం చెల్లాయమ్మ. ఎస్ మంగాయమ్మ. సారపు, వెంకటలక్ష్మి. స్కూలు సానిటేషన్ యూనియన్ నాయకులు. కె విజయ కుమారి. పి, కుమారి. చోడి, లక్ష్మీ ప్రసన్న కుమారి. అంగనవాడి,ఆశ వర్కర్స్, స్కూలు శానిటేషన్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలి

-ఐటిడిఎ పిఒ అభిషేక్



భవనాన్ని ప్రారంభిస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-చింతపల్లి: గిరిజన మహిళలు విడివికే హబ్‌లను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ సూచించారు. అన్నవరంలో ఏర్పాటు చేసిన విడివికే హబ్ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటిడిఏ పరిధిలో 106 వీడివికెలు ఉన్నాయని చెప్పారు. పివిటిజి ల కోసం 8, ఇతర గిరిజన సామాజిక వర్గాలకు 98 వీడీవీకె లను ఏర్పాటు చేశామన్నారు. కొన్ని విడివికె లను అనుసంధానం చేసి11 వీడీవీకే హబ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ముందుగా అడ్డాకుల తయారీ విడివికే హబ్ ను పాడేరులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో 11 మండలాల్లో వీడీవీకేలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గిరిజన మహిళలు విడివికలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఆర్థిక స్వాలంబన సాధించి కుటుంబాలకు ఆసరాగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారులు వీఎస్ ప్రభాకర్‌రావు, ఎం వెంకటేశ్వరరావు, డిఆర్డిఏ పిడి వి.మురళి, ఐటిడిఏ పరిపాలన అధికారి ఎం.హేమలత, వీడీవీకే సభ్యులు పాల్గొన్నారు.

66 మెట్రిక్ టన్నులు కాఫీ విక్రయం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: చింతపల్లి ఎకోపల్పింగ్ యూనిట్ నుండి 66 మెట్రిక్ టన్నుల పార్చిమెంటు కాఫీని ఐటిసి సంస్థకు విక్రయించామని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గిరిజన కాఫీ రైతులకు మంచి గిట్టుబాటు ధర అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. బెంగుళూరు కుసాలినగర్‌లోని ఐటిసి కంపెనీకి విక్రయిస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో 6 టన్నులు పార్చిమెంటును కిలో రూ.450 లకు పంపించగా రవాణా ఖర్చులు, ఎగుమతి, దిగుమతి ఖర్చులు పోను రూ.418 లు వచ్చాయన్నారు. రెండవ విడతలో 20 టన్నుల పార్చిమెంటును రూ.452 ల చొప్పున 20 టన్నులు ఎగుమతి చేసామని ఖర్చులు పోను రూ.436 మిగిలిందన్నారు. మూడవ విడతలో 40 టన్నుల పార్చిమెంటును రూ.468లకు పంపించామన్నారు. ప్రతీ విడతకు ఐటిసి కంపెనీతో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఈ మేరకు లభించిన ధరను కాఫీ పళ్లు సరఫరా చేసిన రైతులకు చెల్లిస్తామని పేర్కొన్నారు. మరో 30 టన్నుల పార్చిమెంటును ఎగుమతి చేసే అవకాశం ఉందని ఈ ఏడాది కాఫీ రైతుల నుండి కిలో కాఫీ పళ్లకు రూ.44లకు మాక్స్ సంస్థ ద్వారా కొనుగోలు చేస్తున్నామన్నారు. పార్చిమెంటు విక్రయించగా వచ్చిన ధరలో రవాణా ఎగుమతులు, దిగుమతులు పోను వచ్చిన లాభాలను రైతులకు బోనస్ రూపంలో చెల్లిస్తామని పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా రహదారి నిర్మాణం

ప్రజాశక్తి -సీలేరు: జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ అన్నవరం, మెట్ట వీధి పివిటిజిలు తమ గ్రామానికి సొంతంగా రహదారి నిర్మించుకుంటున్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా గ్రామంలో పలువురికి ఇళ్లు మంజూరైనప్పటికీ, గృహనిర్మాణ సామగ్రి తరలించేందుకు వీలు లేకపోవడంతో నిర్మించుకోలేని పరిస్థితి ఉంది. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయా గ్రామాల్లోని ఆరు కుటుంబాల పివిటిజిలు తామే సొంతంగా రూ.80వేల నిధులను సమకూర్చుకున్నారు.ఆయా నిధులతో జెసిబి సాయంతో తమ గ్రామానికి సుమారు కిలోమీటరు మేర రహదారిని చదునుచేసి ఏర్పాటు చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లోనూ అవస్థలు పడుతున్నామని, ఇపుడు కేంద్ర ప్రభుత్వం తమకు ఇళ్లు మంజూరుచేసినా నిర్మించుకోలేని పరిస్థితి ఉందని వారంతా ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇనుపగజాలు, పిక్క, ఇసుక, ఇతర సామగ్రి తరలింపునుకు వీలుగా డబ్బులను కూడేసి స్వచ్ఛందంగా కొంతమేరు రోడ్డు నిర్మించామని వారు అంటున్నారు ఇప్పటికైనాజిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, ఇతర అధికారులు, నేతలు స్పందించి, తమ గ్రామానికి పక్కారోడ్డు సౌకర్యం కల్పించాలని మొరపెట్టుకుంటున్నారు.



జెసిబితో రోడ్డు వేయించుకుంటున్న పివిటిజిలు



ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: యూటీఎఫ్ బల పర్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని విజయగౌరిని గెలిపించాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం అనంతగిరి మండలంలోని శివలింగపురం జిటిడబ్ల్యూఏ పాఠశాలలో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరీ ను గెలిపించాలని ప్రచారంలో చేపట్టారు. ఉద్యోగుల, కార్మికులు, కోసం నిరంతరం పోరాడే అభ్యర్థులను గెలిపించి చట్టసభలో పంపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పుడిగి దేముడు, ఉమ్మడి జిల్లా పూర్వ సహాధ్యక్షులు శెట్టి రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి నిరాజి మల్లేశ్వరరావు, సహాయధ్యక్షులు ఎస్ గంగరాజు, కోశాధికారి బూర్జ విజయకుమార్, కార్యదర్శులు దేముడు, నారాయణ ,తదితరులు పాల్గొన్నారు.

జిసిసి డిపో మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: కంద్రుమ్ పంచాయతీ కేంద్రంలోనున్న జిసిసి డిపో మరమ్మతు చేయడానికి పంచాయతీకి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అయ్యాయి. దీంతో రేషన్ డిపో మేజర్ మరమ్మతు చేయుడానికి స్థానిక సర్పంచ్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి సోమవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, స్థానిక వార్డు సభ్యులు తాంగుల బాల్ మొత్తి, జన్ని బలరామ్, గ్రామస్తులు తాంగుల కెమ్ దాస్ నాయుడు, గ్రామపెద్ద తాంగుల మాదవ రావు, పీసా ఉపాధ్యక్షులు తాంగుల పట్నాయక్ , నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ఉత్తమ ఎఇఆర్ఒగా తహశీల్దార్

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజక వర్గం నుంచి ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రార్‌గా స్థానిక తహశీల్దార్ పి.రామకృష్ణ రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ పురస్కారాన్ని అందు కున్నారు. అమరావతిలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నుంచి ఉత్తమ ఎఇఆర్ఒగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ వారి, రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ ప్రోత్సాహంతో ఓటర్ల జాబితా సవరణ, కొత్తఓటర్ల నమోదు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడానికి గుర్తింపుగా తనకు రాష్ట్రస్థాయిలో అవార్డు దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులతోపాటు తనకు సహకరించిన కార్యాలయ సిబ్బంది, మండల ప్రజలు, ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.



చీఫ్ సెక్రటరీ విజయానంద్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న తహశీల్దార్ రామకృష్ణ

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన కుట్టుశిక్షణ



కుట్టుశిక్షణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి -సీలేరు: జికె.వీధి మండలం సీలేరు సిఆర్‌పిఎఫ్ జి 42 బెటాలియన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సిఆర్‌పిఎఫ్ సిఐ వినోద్, ఎస్ఐ కె.రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వినోద్ మాట్లాడుతూ దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ, బూషికొండ, చల్లనిశిల్ప, దుప్పిలివాడ, సీలేరు పంచాయతీకి చెందిన పార్వతినగర్, టిఆర్‌సి క్యాంపునకు చెందిన 11 మందిని కుట్టుశిక్షణను ఎంపిక చేశామని,వీరికి నెల రోజులపాటు టైలరింగ్‌పై టీచర్ దండుపాటి కళావతి శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం వారికి ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేసి, వారి జీవనోపాధికి సాయపడతామన్నారు. సిఆర్‌పిఎఫ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సోలార్ నీటి పథకాన్ని బాగు చేయరూ..?



మరమ్మతుకు గురైన సోలార్ నీటి పథకం

ప్రజాశక్తి- కూనవరం :మండలంలోని అయ్యవారి గూడెం గ్రామంలో ఉన్న సౌర విద్యుత్ ఆధారిత పంపు పనిచేయక గ్రామస్తులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్లుగా సోలార్ తాగునీటి పథకం పని చేయడం లేదని, దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. సోలార్ నీటిపథకం. పంపు నుండి వచ్చే పైపు పరిమాణం కన్నా తక్కువ పరిమాణం గల పైపులు సరఫరా ఇవ్వడం వల్ల పైపులు మూసుకుని పోయి నీళ్ల సరఫరా ఆగిందని అంటున్నారు. వేసవి కాలంలో ఈ సమస్య ఇంకా తీవ్రం అవుతుందని, కాబట్టి ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

30న చింతపల్లిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఇన్ఫోసోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో టాటా ఎలక్ట్రానిక్ సంస్థలో ఉద్యోగాలకు ఈనెలఈనెల 30న చింతపల్లిలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారని జికె.వీధి సిఐ వరప్రసాద్ వెల్లడించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో 18 -26ఏళ్లలోపు యువతీ యువకులకు ఉద్యోగాలకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బిల్లుల పేరిట నగదు వసూలు చేస్తే చర్యలు

అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం



సమస్యలను చెబుతున్న సభ్యులు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని మండల ఎంపీడీవో సాయి హర్ష ఆధ్వర్యంలో మండల ఎంపిపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అరకు శాసనసభ సభ్యులు రేగం మత్స్యలింగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గృహనిర్మాణాలపై ఏఈ కృష్ణారావు అడిగి తెలుసుకున్నారు. గృహాల లబ్ధిదారుల నుంచి బిల్లుల పేరిట సొమ్ము వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవనీ హెచ్చరించారు. వర్క్ ఇన్స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. రీ సర్వే ప్రదర్శకంగా నిర్వహించాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులను మళ్లీ తలెత్తకుండా పరిష్కారం చేయాలన్నారు.

లక్ష్మీపురం పంచాయతీ సిపిఎం సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, మండల స్థాయి అధికారుల పని తీరుపై ఆగ్రహించారు. అధికారులు మండల కేంద్రంలో స్థిరంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. దూర ప్రాంతాలలో నివాసం ఉంటూ విధులు నిర్వహిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు కోరారు. విద్య, వైద్య శాఖ అధికారులు సమయ పాలనతో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాదలని ఎమ్మెల్యేకు విన్నవించారు.జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని, రాబోయే ఎండాకాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కమిటీ ఆధ్వర్యంలో అర్హుల నియామకం

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలోని వెనుకబడిన ప్రాంతాలను నీతి అయోగ్ పథకం ద్వారా ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోస్ ఖాళీగా ఉన్న ఒక పోస్టుకు కమిటీ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను నియమిస్తామని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కార్యాలయ చాంబర్‌లో వైరామవరం మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోస్ పోస్టుకు14 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించగా, వారిలో 11 మంది ఇంటర్వ్యూకు వచ్చారన్నారు.

ఐటిడిఎ పిఒ చైర్మన్‌గా సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ , కమిటీ సభ్యులు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ. విజయశాంతి , ఎడియంహెచ్ఒ జి.శిరీష, సిడిపిఒ సంధ్యారాణి , వెలుగు డిపిఎం హెచ్ఆర్, అపర్ణ సభ్యులుగా ఉన్న కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించి, అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించి ఎంపిక చేస్తారన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- పెదబయలు: మండలం గోమంగి పంచాయతీ గోమంగి శ్మశాన వాటికకు రహదారి మంజూరు చేయాలని ఎంపీడీవో పూర్ణయ్య, తహసిల్దార్ రంగారావులకు గ్రామస్తులు తీర్మానంతో కూడిన వినతి పత్రం అందించారు.శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం లేక పంట పొలాల మధ్యలోని నడుచుకుంటూ వాగు దాటి వెళ్ళవలసిన పరిస్థితి వస్తుందన్నారు. వర్షాకాలంలో గెడ్డలు పొంగి ప్రవహిస్తూండటంతో అనేక ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఎదుర్కొంటున్నామన్నారు. రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోమంగి పిసా ఉపాధ్యక్షులు కూడా రాధాకృష్ణ, పిసా కార్యదర్శి జంపరంగి సునీల్ కుమార్, గోమంగి ఉపసర్పంచ్ మత్స్య కొండబాబు, ఆదివాసి జిల్లా నాయకులు కొమ్మ పృథ్వీరాజ్ జంపరంగి తిరుపతిరావు పాల్గొన్నారు.



అవార్డు అందుకున్న శ్రీనివాసరావు

అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - చింతపల్లి : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన మండలానికి చెందిన వ్యవసాయ అధికారి బి శ్రీనివాసరావు, స్థానిక ఆసుపత్రి హెడ్ నర్స్ వెంకటరత్నం, ల్యాబ్ టెక్నీషియన్ భవానీలు ఎంపికయ్యారు. పాడేరులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో అల్లూరి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ చేతుల మీదుగా వారు అవార్డులు అందుకున్నారు.

జి.మాడుగుల: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా జి మాడుగుల మండల పంచాయతీ పంచాయతీ సర్పంచ్ ఎస్ రామకృష్ణ కు ఉత్తమ పురస్కారం దక్కింది. జల జీవన మిషన్ ద్వారా పంచాయతీలో పలు గ్రామాలకు మంచినీటి సౌకర్యం అందించడంలో ముఖ్య పాత్ర వహించి, ఆదర్శ పంచాయతీగా నిలిపినందుకు ఆయనకు పురస్కారం లభించింది. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఢిల్లీలో జేజేఎం డైరెక్టర్ ప్రదీప్ సింగ్ చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో ఆయనతో ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ ఏఈ విజయ్ కుమార్ పాల్గొన్నారు

కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే ప్రమాదాలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : రక్షణ, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాలే కారణమని డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు అన్నారు. ఎన్ఎడి సత్యాగ్రహ దీక్ష శిబిరం వద్ద ఎన్ఎడి సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన మహారాష్ట్ర బండారాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో జరిగిన బ్లాస్టింగ్‌లో చనిపోయిన ఎనిమిది మంది కార్మికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగ సంస్థల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడంతోపాటు, బ్రిటిష్ కాలం నాటి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేస్తోందని, కాంట్రాక్టీకరణ, ఆఫ్ లోడింగ్ విపరీతంగా పెరిగిందని ఈ విధానాలే ప్రమాదానికి కారణమవుతున్నాయని వివరించారు. రక్షణ రంగంలో సుమారు రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీచేయకుండా పనులను ప్రైవేటుకు అప్పగిస్తున్నారని, ఇది దేశ భద్రత, రక్షణకు తీవ్రమైన హాని చేస్తుందని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికవర్గాన్ని అణిచివేయడం కోసమే చట్టాలలో మార్పు చేస్తున్నారని తెలిపారు. రక్షణ రంగంలో సమ్మెలను నిషేధించడంతోపాటు, సమస్యలపై నిలదీస్తున్న యూనియన్ నాయకులపైనా, కార్యకర్తలపైనా కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని చెప్పారు. అందులో భాగంగానే ఎన్ఎడిలో 36 మందిని సస్పెండ్ చేసి, డాక్ యార్డులో 46 మందికి వార్నింగ్ లెటర్ ఇచ్చి కార్మికులను భయపెట్టాలని చూస్తుందని, వీటిని ఐక్య ఉద్యమాల ద్వారా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

పర్యావరణహిత కట్టడాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి -మధురవాడ : భవన నిర్మాణ రంగంలో అనవసర వ్యయాన్ని తగ్గించడంతో పాటు సహజ సిద్ధమైన నిర్మాణ సామగ్రిని ఉపయోగిస్తూ పర్యావరణ హిత కట్టడాలకు ప్రాధాన్యతనివ్వాలని బెంగళూరుకు చెందిన బయోమ్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు, ప్రముఖ ఆర్కిటెక్ట్ చిత్ర విశ్వనాథ్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యాన సోమవారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆమె ప్రసంగించారు. భారతదేశం సహా వైవిధ్యం వంటి దేశాలలో తాము దాదాపు 700కు పైగా భవనాలను కేవలం మట్టితో నిర్మించామని దాని వల్ల నిర్మాణ వ్యయం తగ్గడంతో పాటు పర్యావరణ కట్టడాలుగా అవి గుర్తింపు పొందాయని తెలిపారు. ఇంటి నిర్మాణం జరిగే సమయంలో అక్కడి నేలతో పాటు నీటి వనరుల లభ్యత, గాలి, వెలుతురు వంటి పరిగణలోకి తీసుకుని నిర్మాణం చేపట్టడం వల్ల పర్యావరణానికి హాని కలగని రీతిలో కట్టడాలు పూర్తి చేయవచ్చన్నారు. వాన నీటి సంరక్షణ పద్ధతులను, ప్రకృతి వనరులను వినియోగించి నిర్మాణంలో వాడటం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. తాము నిర్మించిన ఈ తరహా భవనాల్లో ఫ్యాన్లు, ఏసీలు వాడవసరం ఉండదన్నారు.

ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు..

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరుకులోయ ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ, అరుకు ఏరియా ఆసుపత్రిలో గత 20 సంవత్సరాల నుండి పారిశుధ్య కార్మికులుగా అనేక సేవలు అందిస్తున్న వారికి ఇచ్చే వేతనం సరిపోదలేదన్నారు. చట్ట ప్రకారం కనీస వేతనం 26,000 చెల్లించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. 2019లో అప్పటి వైసిపి ప్రభుత్వం 16,000 వేతనం జీవో విడుదల చేశారని, నేటికీ అది అమలు కాలేదని అన్నారు. కొత్తగా జాయినింగ్ అయిన వారికి పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని ప్రతి నెల జీతం చెల్లించాలని తెలిపారు. రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలని, జీతాల్లో కోతలు విధించరాదని తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.సమస్యను పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ సెక్రటరీ రఘు, కాసులమ్మ, రామచంద్ర, రామారావు తదితరులు పాల్గొన్నారు.



గోతులుగా ఉన్న రోడ్డు

రాళ్లు తేలిన రహదారి

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని సిరగాం రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడికక్కడ రాళ్లు తేలడంతో రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోడిపుంజువలస నుండి సిరగం, వర వెళ్లే రహదారి గుంతలు ఏర్పడి రాళ్లు బయటకు తేలిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డు పాడైపోయి ఐదు ఏళ్ళు దాటుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు లో అత్యవసర పరిస్థితుల్లో గర్భిణి స్త్రీలను అరకు ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి కూడా కష్టంగా మారింది. సచివాలయం సిబ్బంది కూడా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీని దృష్టిలో పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి సిరాగం రోడ్డు మరమ్మతు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి: బలపం పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల్లో గర్భిణీ స్త్రీలకు ప్రసూతి నివాస గృహాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.35 లక్షల నిధులు మంజూరు చేశారని బలపం సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో గర్భిణీ స్త్రీల వసతి గృహ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ సందర్భంగా సోమవారం పిసా కమిటీ ఉపాధ్యక్షుడు వీరయ్య దొరతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బలపం పంచాయతీ పరిధిలోని 33 గ్రామాలతో పాటు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గ్రామాల గర్భిణీ స్త్రీలు వారం రోజులు ముందుగానే ఆసుపత్రికి తరలివచ్చి వసతి గృహంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మారుమూల ప్రాంతాల గర్భిణీ స్త్రీలు ప్రసవం సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని వస్తుంటారని, సరైన సమయంలో వైద్య చికిత్సలు అందక ఎంతోమంది మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇకపై వసతిగృహ నిర్మాణంతో గర్భిణీ స్త్రీలు ముందు నుంచి వైద్య సేవలు పొంది సుఖవంతమైన ప్రసవాలు జరిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిసా కార్యదర్శి పరమేష్, చిట్టిబాబు, వైకాపా సీనియర్ నాయకుడు బచ్చల బాబురావు, కూటమి నాయకులు బచ్చల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రమేష్‌నాయుడు

నేరాలు ఘోరాలు

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వేర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి సంబంధించి సిఐ సిహెచ్.శ్రీధర్ కథనం ప్రకారం... కృష్ణాపురం గ్రామానికి చెందిన ఆదిత్య (21), కనకాల లక్ష్మి (31) వేర్వేరు ప్రదేశాలలో ఉరి వేసుకొని మృతిచెందినట్లు కనిపించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఎంవిపి.కాలనీ సెక్టర్-3లో ఇటీవల జరిగిన చోరీ కేసును ఛేదించి సొత్తును స్వాధీనం చేసుకున్నామని ద్వారక క్రైమ్ ఎసిపి ఎ.వెంకటరావు తెలిపారు. సోమవారం ఎంవిపి క్రైమ్ పోలీసుస్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 16వ తేదీన ఎంవిపి.కాలనీ సెక్టార్- 3లో కె.శామ్యూల్ అనిల్ కుమార్ ఇంటిలో జరిగిన దొంగతనం కేసులో జోడుగుళ్లపాలేనికి చెందిన వాసుపల్లి నరసింగరావును అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. నిందితుడు అపహరించిన రూ.61,700 విలువ చేసే సొత్తు, 55 ఇంచుల సోనీ బ్రేవియ టివి, ఫేబర్ నాలుగు బర్నర్ల గ్యాస్ స్టవ్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసును ఛేదించి నిందితున్ని అరెస్టు చేయడంలో క్రైమ్ సిఐ వి.చక్రధరరావు, ఎస్ఐ ఎం.అప్పలరాజు, ఎఎస్ఐ డి.కిషోర్ బాబు, కానిస్టేబుళ్లు పి.అప్పలరాజు, అగస్టీన్ తదితరులు పని చేశారన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గోస్తనీ వంతెన పై నుంచి సోమవారం సాయంత్రం నదిలో దూకి ఆత్మ హత్యకు యత్నించిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినిని స్నేహితులు వెంటనే ప్రాణాపాయం నుంచి కాపాడారు. భీమిలి సిఐ సుధాకర్ కథనం ప్రకారం... ఛాతి సంబంధిత సమస్యతో కొంత కాలంగా తండ్రి బాధపడుతూ ఉండడం, అనారోగ్యంతో తల్లి మంచం పట్టి ఉండడంతో తీవ్ర మనో వేదనకు గురైన కుమార్తె నదిలో దూకి ఆత్మ హత్యకు ప్రయత్నించింది. ఆత్మ హత్యకు పాల్పడిన విద్యార్థిని సొంతూరు భోగాపురం మండల పరిధిలో ఉంది. స్నేహితుల సాయంతో ఇంటికి చేరిన తమ కుమార్తె బాగానే ఉన్నట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో రత్నాల పాలెం గ్రామానికి చెందిన బుంగ అప్పారావు (50) అనే వ్యక్తి సోమవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అప్పారావు మృతి చెందాడు. స్థానిక ఎస్సై రమేష్ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి నిత్యం మద్యం సేవిస్తూ ఉండడంతో భార్య మందలించిందని గడ్డి మందు తాగినట్లు తెలిపారు. మృతుడు అప్పారావు కి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్లు తెలిసింది. మృతుడు రిక్షా లాగుతూ జీవనం సాగిస్తుండేవాడు.

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని మత్స్యకార గ్రామమైన బంగారమ్మపాలెం గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న సుమారు నలభై మద్యం కేసులను గ్రామస్థులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం గుడివాడ మద్యం దుకాణం నుండి ఆటోలో తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకుని స్థానిక పోలీసులకు, ఎక్సైజ్ అధికారులకు సమాచార మందించారు. ఈ మేరకు జిల్లా యస్పీకి ఫోన్‌లో సమాచారమందించినట్లు తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ గాంధీనగర్‌కు చెందిన 13ఏళ్ల బాలికను అత్యాచారం చేసిన ఆరోపణలతో మున్సిపాలిటీ పరిధి ఉలక్కిపేటకు చెందిన మళ్ల రూపేశ్‌ను అరెస్టు చేసినట్లు పరవాడ డిఎస్‌పి స్వరూప్ తెలిపారు. సోమవారం పట్టణ పోలీసు స్టేషనులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, బాలికను భయపెట్టి అత్యాచారం చేసిన ఘటనలో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టంతోపాటు ఐటి యాక్ట్ కింద టౌన్ పిఎస్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న పిఒ, సబ్ కలెక్టర్

పిజిఆర్‌ఎస్‌కు 105 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 105 అర్జీలు వచ్చాయని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం తెలిపారు. ఆయా దరఖాస్తుల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశించినట్లు వెల్లడించారు. సోమవారం ఐటిడిఎ సమావేశపు హాలులో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్.కెఆర్.కల్పశ్రీ, ఎపిఒ జనరల్ డిఎన్‌వి.రమణ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని, పిఆర్‌జిఎస్ నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎడిఎంహెచ్ఒ డాక్టర్ జి.శిరీష, డిఇఒ వై.మల్లేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం డాక్టర్ వెంకట ఇందిరా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ. శ్రీనివాసరావు, సుబ్బయ్య, గాబ్రియేలు, రవికుమార్, డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, తహశీల్దార్ పి.రామకృష్ణ, ఎంపిడిఒ యస్. శ్రీనివాసరావు దొర, సిడిపిఒ సంధ్యారాణి, డిటిలు శ్రీధర్,స్వామి, రవీంద్రబాబు, స్వామి, త్రిమూర్తులు, పిహెచ్ఒ చిట్టిబాబు, పిఎఒ ఎల్.రాంబాబు, ఎడిఎ సిహెచ్ కెవి చౌదరి,ఉపాధి హామీ పథకం ఎపిడి జి. శ్రీనివాసరావు, వెలుగు ఎపిడి దేగలయ్య, డిఇఇలు మల్లికార్జునరావు, సాయి సతీష్, పి.వెంకటరమణ, చైతన్య, డిడి కార్యాలయ సూపరెంటిండెంట్ బి.కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఎలక్ట్రీషియన్ దినోత్సవం

ప్రజాశక్తి- వి.ఆర్.పురం: మండల కేంద్రం రేఖపల్లిలో మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఎలక్ట్రీషియన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిషన్, విద్యుత్‌ను కనుగొన్న మైఖేల్ ఫారడే, అలాగే పాడేరు జిల్లాలో ఎలక్ట్రిషన్స్ దైవంగా కొలిచే మోదుకొండమ్మ అమ్మవారు చిత్ర పటాలను పూల మాలలు వేశారు. విద్యుత్ సిబ్బందికి ప్రతీకగా నిలిచే నీలం జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా వడ్డిగూడెం కాలనీకి చెందిన బాబ్జి అనే ఎలక్ట్రీషియన్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఎలక్ట్రీషియన్లు మాట్లాడుతూ సమాజంలో ఎలక్ట్రీషియన్ల అవసరం ఎంతో ఉందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విద్యుత్ సంబంధిత పనిముట్లు ఇచ్చి ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొర్రా గంగరాజు, ముంజపు శివరావు, కడుపు దుర్గారావు, ముత్యాల శంకర్రావు, నాలారపు ప్రకాష్ రావు, తాత బబు రెడ్డి, దుర్గారావు, నరసింహారావు, రమేష్, గాంధీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రంపచోడవరం : జాతీయ ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా రంపచోడవరంలో విజయ సాయి దుర్గ ప్రయివేట్ ఎలక్ట్రిషియన్స్అండ్ ప్లంబర్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా రంపచోడవరంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం సిరిగిందలపాడు గ్రామంలో రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ఎలక్ట్రికల్ పితామహుడు సర్ థామస్ అల్వా ఎడిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రంపచోడవరం అధ్యక్షులు.ఎడ్లపల్లి పోసిబాబు, ఉపాధ్యక్షులు.ఎన్ ప్రసాద్, సెక్రెటరీ. పి సురేష్ జాయింట్ సెక్రెటరీ.టి.నాగు కోశాధికారి.డి రమేష్, కార్యవర్గ సభ్యులు. పి దుర్గా రావు.జి సతీష్. లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ం ఎంపిపి గోము వెంకటలక్ష్మి అధ్యక్షత జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ ఆదేశాలతో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరావు సోమవారం తెలిపారు తదుపరి సమావేశం వివరాలను . ప్రజా ప్రతినిధులు, అధికారులకు తెలియజేస్తామన్నారు.

సడలింపులు ఇవ్వాలి

1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న వివాదాస్పద వ్యాఖ్యలు

విశాఖలో పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా 1/70 చట్టంలో సడలింపులు ఇస్తే ఇన్వెస్టర్లు ముందుకు వస్తారంటూ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు విశాఖ వేదికగా సోమవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గిరిజనులకు, వారి భూములకు ఎంతో రక్షణ కల్పించే ఈ ప్రత్యేక చట్టంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఆదివాసీ ప్రాంతాన్ని పాలసీల పేరిట కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలింతకీ ఏం జరిగిందంటే..

ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం వేదికగా నిర్వహిస్తున్న రెండో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పర్యాటక శాఖలో పెట్టుబడులు పెట్టేవారికి ఆటంకాలు లేకుండా చూడాలని తెలిపారు. నర్సీపట్నం సమీపంలోని లంబసింగికి వేలాదిగా పర్యాటకులు వస్తున్నారని, కనీస సౌకర్యాలు లేకపోవడం శోచనీయమని అన్నారు. పాడేరు అమ్మవారి దేవాలయాన్ని, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పార్కును, పురాతన బొజ్జన్నకొండను మరింత వృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్మనీ మాదిరిగా విశాఖలోని ఆర్కే బీచ్ నుండి భీమిలి బీచ్ వరకు చిన్న చిన్న హట్స్ వేయాలని కోరారు. 1/70 చట్ట ప్రకారం గిరిజన ప్రాంతంలో పెట్టుబడులు గిరిజనులే చేయాలని, కానీ అంత పెద్ద మొత్తం వారు చేయగలరా ? అని ప్రశ్నించారు. చట్టంలో సడలింపులు ఇస్తే ఇన్వెస్టర్లు ముందుకు వస్తారన్నారు. విశాఖ ఉత్సవ్‌లాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అద్భుత ప్రకృతి రమణీయతకు చిరునామా ఉత్తరాంధ్ర ప్రాంతమని, ఇక్కడ పర్యాటక ప్రాజెక్టులను తీసుకురావడం ద్వారా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ ఇప్పటికే విజయవాడలో ఒక ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహించామని, ప్రస్తుతం రెండో సమ్మిట్‌కు విశాఖ వేదికైందని అన్నారు. భవిష్యత్తులో ఒకే ఇజం ఉంటుందని, అదే టూరిజమని అన్నారు. విజన్ 2047 డాక్యుమెంట్‌లో సైతం పర్యాటక రంగానికి ముఖ్యమంత్రి అగ్ర ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. స్టాంప్ డ్యూటీ, టాన్స్ఫర్ డ్యూటీ, ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీలను మినహాయిస్తూ విడుదల చేసిన నూతన పర్యాటక పాలసీ 2025-29 అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో టూరిజం ఎమ్‌డి ఆమ్రపాలి, విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మాడుగుల, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, లోకం నాగమాధవి, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు చూపుతున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఒప్పందాల వివరాలివీ..

అట్మాస్ఫియర్ కోర్ సంస్థ యారాడ బీచ్‌లో రూ.500 కోట్లు, అమరావతిలో రూ.250 కోట్లు, తిరుపతిలో రూ.250 కోట్లు పెట్టుబడితో మొత్తం మూడు హోటళ్లను నిర్మించేందుకు ఒప్పందం కుదిరింది. సుమీ యశశ్రీ సంస్థ 50 కోట్ల పెట్టుబడితో విశాఖపట్నం, గుంటూరుల్లో రిసార్టులు నిర్మించేందుకు ఒప్పందం చేసుకుంది. ఎవరెస్ట్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ వారు విశాఖపట్నంలో ఏడు కోట్ల రూపాయల వ్యయంతో వెల్‌నెస్ రిసార్ట్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. రాయల్ పామ్స్ సంస్థ వారు బాపట్లలో రూ.30 కోట్ల పెట్టుబడితో విలాసవంతమైన రిసార్ట్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. రిప్పిల్స్ అండ్ కో సంస్థ వారు అల్లూరి సీతారామరాజు జిల్లా సరియపల్లి గ్రామంలో రూ.100 కోట్ల పెట్టుబడితో కన్వెన్షన్ సెంటర్, డెస్టినేషన్ వెడ్డింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. బ్లూ రే ఇన్ఫో ప్రాజెక్ట్ సంస్థ వారు రూ.18 కోట్ల పెట్టుబడితో విశాఖపట్నం సమీపంలోని భోగాపురం ఎయిర్‌పోర్టు వద్ద బీచ్ ఫ్రంట్ హోటల్, రిసార్ట్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. హోటల్ ఎస్ పార్క్ సంస్థ వారు ఏడు కోట్ల పెట్టుబడితో బాపట్ల వద్ద హోటల్ అండ్ రిసార్ట్ నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. డాల్ఫిన్ ఓషన్ క్రూజ్ సంస్థ వారు ఐదు కోట్ల పెట్టుబడితో విశాఖపట్నంలో యత్చ్ క్రూజ్ టూర్స్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు.

పివిటిజిలకు అభినందన

ప్రజాశక్తి - రంపచోడవరం : ఢిల్లీలోని గణతంత్ర వేడుకలకు ఐటిడిఎ, ఎపిఇపిడిసిఎల్ తరపును హాజరై తిరిగొచ్చిన రంపచోడవరం ఏజెన్సీ నుంచి పిఎం జన్‌మన్ సోలార్ పథకంలో లబ్ధిదారులను ముగ్గురు పివిటిజి లబ్ధిదారులు సోమవారం మర్యాదపూర్వకంగా రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కెఆర్.కల్పశ్రీలను కలిసారు. ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు వెళ్లి వచ్చిన మరిగెల అప్పారావు, మరిగెల లక్ష్మయ్య, మరిగెల గోపాలరెడ్డిలతోపాటు వీరికి సహాయకులుగా క్యాంపెయినర్ పళ్ళ కేశవరెడ్డి, లైజనింగ్ అధికారి షాలేము రాజు, ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాబ్రియల్‌తో ఐటిడిఎ ప్రాంగణంలో పిఒ, సబ్‌కలెక్టర్‌ను కలిసి, తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా పిఒ కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలో పిఎం జన్‌మన్ పథకం ద్వారా 94 మంది పివిటిజిలకు సోలార్ పథకంద్వారా లబ్ధి చేకూరితే, వారిలో ఎంఎన్‌ఆర్ఇ ద్వారా ఎంపిక చేసిన ముగ్గురిని ఈనెల 22న ఐటిడిఎ, ఎపిఇపిడిసిఎల్ విశాఖలోని కార్పొరేట్ కార్యాలయం ఆధ్వర్యంలో ఢిల్లీ పంపామన్నారు. వారికి పిఒ, సబ్‌కలెక్టర్ అభినందించారు



కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

వైభవంగా క్రీడా సాంస్కృతిక సమ్మేళనం

ప్రజాశక్తి- అల్లూరి జిల్లా : సంక్రాంతి సందర్భంగా జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జమాల్‌ఖాన్ సారథ్యంలో 40 రోజుల పాటు నిర్వహించిన క్రీడాసాంస్కృతిక సమ్మేళనం వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా అంతరరాష్ట్ర క్రికెట్, వాలీబాల్, ఆర్చరీ, ఫుట్‌బాల్ వంటి ఆటల పోటీలతోపాటు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి, విజేతలకు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా నగదు బహుమతులను అందజేశారు. జమాల్ ఖాన్ స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధులు తొలుత క్రీడా సాంస్కృతిక సమ్మేళనం ముగింపు వేడుకలను డాక్టర్ జమాల్‌ఖాన్‌తోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళావేదికపై ఆంధ్రా, తెలంగాణలకు చెందిన కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాల్వంచకు చెందిన ఎస్కే హుస్సేన్ చింతూరు చల్లని పల్లె తల్లి పాట, ములుగు జిల్లాకు చెందిన పముఖ ఇంద్ర జాలికుడు మార్తా రవి ప్రదర్శన, వివిధ విద్యాసంస్థల చిన్నారుల ఫ్యాషన్‌షో, స్వతంత్ర సమరయోధుల వేషధారణలు, సెల్‌ఫోన్ దుష్ప్రభావంపై ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ జమాల్‌ఖాన్ సామాజిక, ఆర్థిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. అనంతరం లక్కీ డ్రా ద్వారా పలువురికి విలువైన వస్తువులు అందజేశారు. అనంతరం గోల్డ్ మెడల్ గ్రహీత మధు చందన, వెయిట్ లిఫ్టర్ గంగాధర్, డాక్టర్ జమాల్‌ఖాన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో జమాల్ ఖాన్, తనయుడు ఇమ్రాన్‌ఖాన్, అబ్రార్‌ఖాన్, అటవీ శాఖ అధికారి తిమ్మ సాయి, సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, వైస్ ఎంపీపీ సుధాకర్ చిన్ని, నాయకులు దాసరి వెంకటరమణ, పి సాల్మన్ రాజు, ముత్యాల శ్రీరామ్, పొదిలి రామారావు, నరసింహారావు, సురేష్ చౌదరి, జనసేన మండలాధ్యక్షులు మడివి రాజు, కూనవరం మండలాధ్యక్షుడు చందు, రసూల్, విఆర్ పురం మండల మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు ఎస్‌కె రియాజ్, జీవన్ కుమార్, మన్యం నూనె రమేష్, షాజహాన్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు నెలవుగా ఎపి

ప్రజాశక్తి - రంపచోడవరం: సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతమైందని, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆకర్షణగానిలిచిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, గడచిన ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు తీసుకురావడానికి సిఎం చంద్రబాబు, రాష్ట్రమంత్రి లోకేష్ శ్రమిస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రాల తెలుగు ప్రజలకు ఐటిని పరిచయం చేసి, తెలుగువాడి కీర్తిని ప్రపంచానికి చాటిన చంద్రబాబు, నేడు మరో ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారన్నారు.. ఏఐ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచ దిగ్గజాలతో భేటీ అయ్యారన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తుందని, పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు స్వర్గధామంలా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు సీఎం చంద్రబాబు విజన్‌ను మెచ్చుకోవడం, రాష్ట్రంలో పెట్టుబడి పెడతానని హామీ ఇవ్వడం చంద్రబాబు విజన్ 2047 విజయాన్ని సూచిస్తోంది.ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులుతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు.